

అపురూపంగా అమ్మ విగ్రహాలు 10లో



ఉత్సాహంగా వృద్ధుల వాక్‌థాన్ 10లో

సాగరతీరంలో శ్రీనిధి



కొమ్మాది: తొట్లకొండ వద్ద మంగళవారం షూటింగ్ సందడి నెలకొంది. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న హిట్-3 సినిమాకు సంబంధించి బీవాచ్ పార్కులో హీరోయిన్ శ్రీనిధి శెట్టి (కేజీఎఫ్ ఫేం)పై పలు సన్నివేశాలను చిత్రీకరించారు.

న్యూస్‌రీల్

డీటీసీగా ఆదినారాయణ బాధ్యతల స్వీకరణ



పూర్వ డీటీసీ రాజారత్నంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదినారాయణ

గోపాలపట్నం: ఉప రవాణా కమిషనర్‌గా జి.ఆదినారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీసీగా ఉన్న రాజారత్నంను విజయవాడ ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అమరావతి డీటీసీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆదినారాయణ ఇక్కడకు బదిలీపై వచ్చారు. పూర్వ డీటీసీ రాజారత్నం నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

మూడు గంటలపాటు అప్పన్న దర్శనాలు బంద్



ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న దేవస్థానం ఉద్యోగి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ తిరుమంజన్ సేవ(ఆలయశుద్ధి) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామి దర్శనాలు బంద్ చేశారు. అనంతరం ఆలయ బేడా మండపం, ఆస్థానమండపం, ఆలయ ప్రాంగణాన్ని నీటితో శుభ్రం చేశారు. అలాగే స్వామివారి నిత్య, వార్షిక ఉత్సవాలకు అవసరమైన సామగ్రిని శుభ్రపరిచారు. అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి దర్శనాలను భక్తులకు కల్పించారు.

పక్కాగా అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

మహారాణిపేట: జిల్లాలో చేపడుతున్న సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీలో అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పక్కాగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు సూచించారు. అమరావతి నుంచి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ జిల్లాలో 99.50 శాతం పూర్తయిందన్నారు. అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పక్కాగా చేపడుతున్నట్లు చెప్పారు. జాబితాలో సవరణల కోసం వచ్చిన దరఖాస్తుల్లో 8,744 పెండింగ్ ఉన్నాయని.. ఈ నెల 5లోగా పరిష్కరిస్తామన్నారు. బీఎల్‌వో స్థాయిలో ఉన్న 11 వేల దరఖాస్తులను విచారించి.. ఇందులో 2,850 మంది మృతి చెందినట్లు గుర్తించామన్నారు. పోలింగ్ స్టేషన్ల పెంపుపై రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించామని, వాటి వివరాలను సమర్పిస్తామన్నారు. స్వీప్ కార్యక్రమంపై ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసినట్లు కలెక్టర్ సీఈవోకు వివరించారు. డీఆర్వో కె.మోహన్ కుమార్, భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కర్ రెడ్డి, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీగా రాధారాణి

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ విశాఖ ప్రాంతీయ డైరెక్టర్‌గా డాక్టర్ రాధారాణిని నియమించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఆర్డీగా పనిచేస్తున్న రామగిడ్డయ్యను వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ రాధారాణికి పదోన్నతి కల్పించి ఇక్కడ నియమించారు.

5న 'రైతుల' ఎంపికకు డ్రా

మహారాణిపేట: రైతుబజార్‌లో స్టాళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపిక చేయడానికి కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 5న బహిరంగ డ్రా నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 9 రైతుబజార్‌ల్లో స్టాళ్ల కోసం 673 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 238 మందిని డ్రా ద్వారా ఎంపిక చేస్తామని జేసీ పేర్కొన్నారు. 673 మంది దరఖాస్తుదారుల పూర్తి వివరాలు www.visakhapatnam.ap.gov.in లో పొందుపరిచినట్లు చెప్పారు. ఎంపికైన రైతులు తమ రక్తసంబంధీకులను మాత్రమే నామినీగా నియమించుకోవచ్చని, సాయంత్రం పూట రైతుబజార్‌లో స్టాళ్లు నిర్వహించడానికి అంగీకరించాల్సి ఉంటుందని జేసీ స్పష్టం చేశారు.

ఇక మద్యం వరదే..







- జిల్లాలో ఏరులై పారనున్న లిక్కర్
- మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల
- ఉమ్మడి విశాఖ జిల్లాలో331 షాపులు
- విశాఖలో 155, అనకాపల్లిలో 136, అల్లూరిలో 40 షాపుల కేటాయింపు
- 9 వరకు దరఖాస్తుల స్వీకరణ, 11న లాటరీ విధానంలో షాపుల కేటాయింపు
- రూ.2 లక్షలు నాన్‌రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు

విశాఖ సిటీ : ఉమ్మడి విశాఖలో మద్యం ఏరులై పారనుంది. నగరంలో కాకుండా గ్రామాల్లో సైతం లిక్కర్ వరద ముంచెత్తనుంది. మరికొద్ది రోజుల్లో మద్యం వ్యాపారం మళ్లీ ప్రైవేటు మాఫియా కబంధ హస్తాల్లోకి వెళ్లిపోనుంది. 2019కు ముందు విధానాన్నే మళ్లీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కొత్త మద్యం పాలసీ ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసి వేసి.. లాటరీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీంతో గత అయిదేళ్ల లిక్కర్ వ్యాపారానికి దూరంగా ఉన్న సిండికేట్లు మళ్లీ జవసత్వాలు నింపుకొని బరిలోకి దిగారు. ఇదిలా ఉంటే.. ప్రభుత్వ నిర్వహణలో సాగుతున్న మద్యం దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది ఇప్పుడు ఉపాధి కోల్పోనున్నారు. నాణ్యమైన మద్యాన్ని తగ్గింపు ధరలకు అందుబాటులోకి తెస్తామంటూ ప్రభుత్వం ఆశచూపింది. ప్రస్తుతమున్న ప్రభుత్వ మద్యం దుకాణాల కంటే వాటి సంఖ్య పెరగనుండడంతో మద్యం ఏరులై పారనుంది. వీటితో పాటు ఇప్పుడు మళ్లీ బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

రూ.3 వేల కోట్లే లక్ష్యం

సర్కారుకు ఆదాయం సమకూర్చే వనరుల్లో ఎక్సైజ్ శాఖ అత్యంత కీలకంగా మారింది. విశాఖ జిల్లాలో ఈ శాఖ ద్వారా ఏడాదికి రూ.3 వేల కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు తగ్గట్టుగానే ప్రస్తుతమున్న షాపుల సంఖ్య కంటే అధికంగా జిల్లాకు కేటాయించింది. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాలు 313 ఉండగా.. ఆ సంఖ్య ఇకపై 331 షాపులకు పెరగనున్నాయి. దీంతో మద్యం విక్రయాలు కూడా భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.



షాపుల కోసం తీవ్ర పోటీ

2019 ముందు వరకు లిక్కర్ వ్యాపారాన్నే నమ్ముకుని ఉన్న వారిలో ఇప్పుడు మళ్లీ పునరుజ్జీవం కనిపిస్తోంది. అయిదేళ్ల వ్యాపారానికి దూరమైన సిండికేట్లు ఇప్పుడు మద్యం షాపులను చేజిక్కించుకోవడానికి తెరవెనుక ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈసారి మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు సైతం భావిస్తున్నారు. ఎంత ఎక్కువ మంది పోటీ పడి దరఖాస్తులు చేస్తే.. అంతటి స్థాయిలో నాన్‌రిఫండబుల్ ఫీజు రూ.2 లక్షల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.

అప్పుడే బెల్టు భయం

గత టీడీపీ హయాంలో బెల్టు షాపులు కోకొల్లలుగా ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బెల్టు షాపులను పూర్తిగా నియంత్రించారు. తాజాగా పాత విధానం అమల్లోకి వస్తుండడంతో మళ్లీ బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అప్పట్లో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికి టీడీపీ ప్రభుత్వం షాపులకు లక్ష్యాలను నిర్దేశించింది. ప్రతి నెలా గరిష్టంగా మద్యం సరుకును కొనుగోలు చేయాలని ఎక్సైజ్ అధికారుల ద్వారా ఒత్తిడి చేసేది. ఈ క్రమంలో మద్యం షాపుల నిర్వాహకులకు మూడు నుంచి అయిదు బెల్టు షాపుల నిర్వహణకు అనధికారికంగా అనుమతులిచ్చేవారు. దీంతో విచ్చలవిడిగా, బహిరంగంగా మద్యం విక్రయించినా అధికారులు పట్టించుకున్న సందర్భాలు ఉండేవి కాదు. ఈ బెల్టు షాపుల బరితెగింపుపై అప్పట్లో మహిళా సంఘాలు పెద్దఎత్తున నిరసనలు తెలిపేవి. ప్రస్తుతం అదే స్థాయిలో మళ్లీ బెల్టు షాపులు పుట్టుకొచ్చే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే మహిళా సంఘాలు ఆందోళన బాట పట్టాయి.

331 లిక్కర్ షాపులకు నోటిఫికేషన్

నూతన మద్యం పాలసీ ప్రకారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం ఉమ్మడి విశాఖలో 331 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చారు. విశాఖ జిల్లాలో 155 షాపులు కేటాయించగా.. జీవీఎంసీ పరిధిలో 136 షాపులు రానున్నాయి. అలాగే అనకాపల్లి జిల్లాలో 136 షాపులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 40 షాపులు ఏర్పాటుకానున్నాయి. ఒక్కో షాపు కోసం దరఖాస్తుదారులు రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

మూడు విధానాల్లో దరఖాస్తులు



దరఖాస్తులను మూడు విధానాల్లో సమర్పించే అవకాశాలు కల్పించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దరఖాస్తుదారులకు ఎటువంటి సందేహాలు ఉన్నా.. దగ్గరలో ఉన్న ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంప్రదిస్తే దరఖాస్తు సమర్పించే విధానాన్ని తెలియజేస్తారని చెప్పారు. ఈ నెల 11న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమక్షంలో లాటరీ నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే అదే రోజు అనకాపల్లిలో ఓల్డ్ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఉప్పాడ చంద్రశేఖర్ కల్యాణ మండపంలోను, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలోని ఎస్పీ ఆఫీస్ సమీపంలో ఉన్న వియా ఫంక్షన్ హాల్‌లో లాటరీ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

హార్బర్ ఏసీపీ మోజెస్‌పాల్‌పై వేటు

విశాఖ సిటీ: హార్బర్ ఏసీపీ మోజెస్‌పాల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఎస్సీ, ఎస్టీ కేసు నుంచి తప్పిస్తానని చెప్పి డబ్బు వసూలు చేసిన వ్యవహారంలో నివేదిక ఆధారంగా సీపీ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే బదిలీ అయినప్పటికీ.. చెప్పకుండా సెలవుపై వెళ్లడాన్ని సీపీ సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. దీంతో పంతం పట్టి మరీ ఏసీపీపై వేటు వేయించారన్న టాక్ వినిపిస్తోంది. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసుల నుంచి తప్పిస్తానని అంకం చౌదరీ అనే వ్యక్తి నుంచి డబ్బులు తీసుకున్నట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. అయితే సదరు నిందితుడిపై ఉన్న కేసు మాఫీ చేయకపోవడంతో అతడు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి దృష్టికి తీసుకువెళ్లాడు. ఈ విషయాన్ని సీపీ సీరియస్‌గా తీసుకున్నారు. అప్పటి డీసీపీ-2 తుహిన్ సిన్హాతో విచారణకు ఆదేశించారు. ఆయన ఆడియో ఆధారంతో పాటు కీలక విషయాలతో నివేదిక తయారు చేసి సీపీకి సమర్పించారు. దానిని సీపీ నేరుగా డీజీపీ కార్యాలయానికి పంపించారు.

బదిలీ అయినా వెళ్లకుండా..

ఇంతలో ఏసీపీ మోజెస్ పాల్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయినా ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ కాకుండా సెలవుపై వెళ్లిపోయారు. విజయవాడలో టీడీపీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఏసీపీ సెలవుపై వెళ్లిన విషయాన్ని తెలుసుకున్న సీపీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కమిషనరేట్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఒకవైపు నిందితుల నుంచి డబ్బు వసూలు, చెప్పకుండా సెలవుపై వెళ్లడంతో అతడిపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి చెప్పినట్లు చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే డీజీపీ ద్వారకాతిరుమల మూడు రోజుల క్రితమే ఏసీపీపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఏసీపీ ఈ సస్పెన్షన్‌ను ఎత్తివేయించుకొని పోస్టింగ్ కొట్టేసే పనిలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.

మసాజ్ సెంటర్లపై దాడులు

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషన రేట్ పరిధిలో 83 స్పా, మసాజ్ కేంద్రాలపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. పోలీస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో 200 మంది సిబ్బందితో రాత్రి 7.45 నుంచి 9.30 వరకు సోదాలు నిర్వహించగా.. 31 సెంటర్లు మాత్రమే తెరిచి ఉన్నాయి. మిగిలిన 52 మూసివేశారు. ఇందులో 25 సెంటర్లకు ఫైర్ ఎన్‌వోసీలు, 10 కేంద్రాలకు ట్రేడ్ లైసెన్సులు, 18 స్పాలకు జీఎస్టీ, రెండింటికి లేబర్ సర్టిఫికెట్లు, ఒకదానిలో పశ్చిమ బెంగాల్ సిబ్బందిని, ఒకదానిలో నలుగురు విదేశీ సిబ్బందిని గుర్తించారు. వీరికి నోటీసులు ఇవ్వడంతో పాటు ఆయా శాఖల సంబంధిత అధికారులకు ఈ కేంద్రాలపై నివేదిక ఇవ్వనున్నారు.

పింఛన్ పాట్లు



సాయంత్రం 5 గంటలకు పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి



పింఛన్ కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు



సచివాలయంలో వేచి ఉన్న పింఛన్‌దారులు

మహారాణిపేట: కూటమి ప్రభుత్వంలో పింఛన్ లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛన్లు అందజేయగా.. కూటమి ప్రభుత్వంలో అందరినీ ఒకే చోటకు రప్పించి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. పెదజాలారిపేటతో పాటు పలు ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించింది. అలాగే సాయంత్రం 5 గంటల వరకు పెదజాలారిపేటలో కొంత మందికి పింఛన్లు పంపిణీ చేయలేదు. లబ్ధిదారులంతా సచివాలయ సిబ్బంది కోసం పడిగాపులు కాశారు. సాయంత్రం 5 గంటల తర్వాత సిబ్బంది వచ్చి.. అప్పుడు సచివాలయం బయట పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 1,62,490 పింఛన్‌దారులు ఉండగా.. ప్రభుత్వం రూ.69.81 కోట్లను విడుదల చేసింది. మంగళవారం రాత్రి 7 గంటల సమయానికి మొత్తం 1,58,709 మంది(97.67 శాతం)కి రూ.68.18 కోట్లు అందజేశారు. మిగిలిన లబ్ధిదారులకు గురువారం పింఛన్ అందిస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శోభారాణి తెలిపారు.

నెయ్యిని పరీక్షించేలోపే లడ్డూ విక్రయాలు జరిగాయి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖ సిటీ: 'నెయ్యిని పరీక్షించేలోపే లడ్డూ విక్రయాలు జరిగిపోయాయి. కల్తీ జరిగింది మాత్రం వాస్తవం' అని టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'నెయ్యితో పాటు లడ్డూలు పరీక్షించారా? ముందే ఎందుకు మాట్లాడారు? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సుప్రీంకోర్టును ఎవరూ ప్రశ్నించలేరు కదా? ధార్మిక సంఘాలు మాట్లాడాయనే మేము కూడా మాట్లాడాం. ఎన్‌డీడీబీ రిపోర్టు ఆధారంగా చెప్పాం. జగన్ చేశారో, లేదో మాకు తెలియదు. అందరూ కల్తీ జరిగిందని నమ్ముతున్నారు. సిట్ విచారణలో అన్ని విషయాలు బయటకు వస్తాయి. సుప్రీంకోర్టు ఆదేశిస్తే సీబీఐ విచారణ జరుగుతుంది' అని అన్నారు.

నేడు రీజినల్ లేబర్ కమిషనర్ సమావేశం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల అంశంపై కేంద్ర కార్మిక శాఖ రీజినల్ లేబర్ కమిషనర్ కె.జె.మొహంతి బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి యాజమాన్యం ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

సరకులిస్తామని డప్పు.. అరకొరగా కందిపప్పు

- 512 మెట్రిక్ టన్నులు అవసరం కాగా.. 30 మెట్రిక్ టన్నులు మాత్రమే విడుదల
- పండగ పూట తీవ్ర నిరాశలో కార్డుదారులు



దువ్వాడ రేషన్ డిపోలో కందిపప్పు విక్రయాలను ప్రారంభిస్తున్న డీఎస్‌వో భాస్కర్

మహారాణిపేట: సూపర్ సిక్స్ అంటూ కూటమి ప్రభుత్వం హామీలిచ్చింది. అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినప్పటికీ ఒక్క పథకమూ అమలు చేయలేదు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అన్ని సరకులిస్తామని డప్పు కొట్టింది. వచ్చి రాగానే ఈ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. మూడు నెలలు కేవలం బియ్యంతో సరిపెట్టేసింది. ఈ నెల దసరా నేపథ్యంలో కందిపప్పు వచ్చేస్తోందని కార్డుదారులకు ఆశపెట్టింది. తీరా అరకొరగా కందిపప్పు విడుదల చేసి చేతులు దులుపుకుంది. జిల్లాలోని 5 లక్షలకు పైగా కార్డుదారుల అవసరాలను తీర్చడానికి సుమారు 512 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరమవుతుంది. అయితే ప్రభుత్వం కేవలం 30 మెట్రిక్ టన్నుల కందిపప్పును మాత్రమే విడుదల చేయడంతో అటు లబ్ధిదారులు.. ఇటు డీలర్లలో గందరగోళం నెలకొంది. బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధరకు కందిపప్పు కొనుగోలు చేయలేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందజేసే కందిపప్పు కోసం నాలుగు నెలలుగా కార్డుదారులు ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు.. పండగ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కందిపప్పు విడుదల చేసింది. దువ్వాడలోని రేషన్ డిపో వద్ద కందిపప్పు అమ్మకాలను మంగళవారం డీఎస్‌వో భాస్కర్ ప్రారంభించారు. అయితే అరకొరగా కందిపప్పు విడుదల చేయడంతో కొన్ని డిపోల్లో ముందొచ్చిన వారికి అందగా.. మిగిలిన వారికి అందక నిరాశతో వెనుదిరుగుతున్నారు. జిల్లాలో 5,12,619 తెలుపు/రైస్ కార్డులు ఉన్నాయి. కార్డుకు ఒక కిలో చొప్పున పంపిణీ చేయడానికి సుమారు 512 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంటుంది. అయితే కేవలం 30 మెట్రిక్ టన్నుల కందిపప్పు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. ఒక రేషన్ డిపోకు 100 కిలోల చొప్పున ఎంపిక చేసిన డీలర్లకు మాత్రమే అందజేయడం గమనార్హం. జిల్లాలోని 625 చౌకధరల డిపోలకు కేటాయించాల్సిన కందిపప్పు.. కొన్ని డిపోలకు మాత్రమే అందజేయడంతో మిగిలిన డీలర్లు ఎదురు చూస్తున్నారు.

నీళ్ల చారు.. పురుగుల అన్నం

- తింటే తినండి లేదంటే మానేయండి
- బక్కన్నపాలెం దివ్యాంగుల కేంద్రంలో నిర్వాహకుల తీరిది
- రాష్ట్ర స్థాయి శిక్షణ సంస్థలో అడుగడుగునా నిర్లక్ష్యం
- పట్టని దివ్యాంగుల మూగ రోదన
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు



నీళ్ల చారు, ప్రమాదకరంగా కరెంటు జంక్షన్ బాక్స్



తిరగని ఫ్యాన్లు చూపిస్తున్న విద్యార్థులు



అన్నం బాగోలేక పడేస్తున్న విద్యార్థి

మధురవాడ : కొందరు మాట్లాడలేరు.. మరికొందరు వినలేరు. ఇంకొందరు వివిధ సమస్యలతో బాధపడుతున్నారు. తమకు ఇది కావాలని అడగలేని పరిస్థితి వాళ్లది. అందుకేనేమో నిర్వాహకులు వారి పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారు. అన్నంలో పురుగులు.. నీళ్ల చారు.. తింటే తినండి లేదంటే మానేయండనే నోళ్లు.. ఇదీ ఏపీ ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధు సహాయ సంస్థ, శిక్షణ, ఉత్పత్తి కేంద్రం నిర్వాహకుల తీరు.!

రాష్ట్ర స్థాయి శిక్షణ సంస్థలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో దివ్యాంగులు నరకయాతన అనుభవిస్తున్నారు. సమస్యలు చెప్పుకోలేక లోలోనే మదనపడుతున్నారు. వివిధ జిల్లాలకు చెందిన 70 మంది దివ్యాంగులు, వయో వృద్ధులు ఇక్కడ కార్పెంటర్, పెయింటింగ్, షీట్‌మెటల్ వర్క్, వెల్డింగ్ తదితర ట్రేడుల్లో శిక్షణ పొందుతున్నారు. మూగ, చెవిటి లోపాలు ఉన్న వారికి ఒక హాలులో, ఇతర లోపాలు ఉన్న విభిన్న ప్రతిభావంతులకు మరో హాలులో వసతి కల్పించారు. అయితే వీరు ఉంటున్న గదుల్లో ఫ్యాన్లు సక్రమంగా పనిచేయడం లేదు. మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. ఆరు బయటకు విద్యార్థులు వెళ్లాల్సి వస్తోంది. కుళాయి ట్యాప్‌లు మరమ్మతులకు గురయ్యాయి. నీటి ట్యాంకులను శుభ్రం చేయడం లేదు. మెనూ చార్ట్ అలంకారప్రాయంగానే ఉంది. రసం నీరులా, అన్నంలో పురుగులు ఉంటున్నాయని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టం అయితే తినడం లేకపోతే మానేయండి అన్న చందంగా సిబ్బంది, వార్డెన్ తీరు ఉందని ఆరోపిస్తున్నారు. ఇక కేంద్రం పరిసరాల్లో విద్యుత్ జంక్షన్ బాక్స్‌లు, వైర్ల జాయింట్లకు రక్షణ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవలే ఓ విద్యార్థి అర్ధరాత్రి మృతి చెందడం కలకలం రేగింది. గతంలో ఇక్కడ స్క్రాప్, విలువైన చెట్లు మాయం చేసిన వ్యవహారంలో ఆరోపణలు ఉన్న వారే ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తుండటం గమనార్హం. పైగా ఇక్కడ పనిచేస్తున్న వారంతా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే కావడంతో కొందరు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి సంబంధించి జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ కార్యాలయం ఇక్కడే ఉన్నప్పటికీ పర్యవేక్షణ అంతంత మాత్రమే. కనీసం ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఇక్కడ తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఫుట్‌బాల్ పోటీల విజేత విశాఖ జట్టు



విజేతగా నిలిచిన విశాఖ బాలుర జట్టు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో విశాఖ జట్టు విజేతగా నిలిచింది. పల్నాడు జిల్లా వినుకొండ లయోలా కాలేజీ ప్రాంగణంలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ అండర్–17 పోటీల్లో పాల్గొన్న విశాఖ బాలుర జట్టు ఆద్యంతం ఆధిపత్యాన్ని కొనసాగించింది. కృష్ణా, కర్నూలు, చిత్తూరు, గుంటూరు, అనంతపురం జిల్లా జట్లతో తలపడి విజయకేతనం ఎగురవేసింది. ఈ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన నలుగురు విద్యార్థులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి దేముడు తెలిపారు.

సింహాద్రి ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడి మృతి

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో సీహెచ్‌పీ–1లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు పడాల నాగేశ్వరరావు (55) మంగళవారం ఉదయం అనుమానాస్పదంగా మృతి చెందాడు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. కలపాక శివారు స్వయంభూవరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు సీహెచ్‌సీ–1లో హౌస్‌కీపిర్‌గా పనిచేస్తున్నాడు. నాగేశ్వరరావు మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడి గుండెకు సంబంధించిన వ్యాధితో కిందపడిపోయాడు. అక్కడే ఉన్న సూపర్‌వైజర్ రామకృష్ణ, తోటి కార్మికులు సీపీఆర్ చేసి దీపాంజలి నగర్‌లో ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నాగేశ్వరరావును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడు కుమారుడు పడాల లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

ఇవేం ఆటలు చెప్మా..!



రైల్వేస్టేషన్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బృందం

ఇదిగో.. ఈ ఫొటో చూడండి. విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేసే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా బృందం విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఎంట్రీ పాయింట్ వద్ద కింద కూర్చొని క్రీడాకారుల దరఖాస్తులను పరిశీలన చేస్తోంది. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా ఇలా విధులు నిర్వహిస్తోంది. పాఠశాల లేదా క్రీడా మైదానం కాదంటే కార్యాలయంలో దర్జాగా కుర్చీలపై కూర్చొని ఈ పని చేయాల్సిన ఫిజికల్ డైరెక్టర్ల బృందం.. హడావిడి ఎంపికలతో ఇలా చేయక తప్పలేదు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే క్రీడా పోటీల్లో ప్రతిభ గల క్రీడాకారుల ఎంపిక ఏ తీరుగా సాగుతుందో దీన్ని బట్టి తెలుసుకోవచ్చు.

- నియోజకవర్గ స్థాయి పోటీలకు మంగళం
- హడావిడిగా జిల్లాస్థాయి ఎంపికలు
- ప్రతిభ గల క్రీడాకారులకు దక్కని చోటు
- వార్షిక క్రీడా క్యాలెండర్ అమలులో అలసత్వం
- వ్యాయామ విద్యపై కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు తోడ్పాటు అందించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రూపొందించిన వ్యాయామ విద్య వార్షిక క్యాలెండర్ అమలుకు ప్రస్తుత ప్రభుత్వం మంగళం పాడేసింది. షెడ్యూల్ మేరకు పాఠశాల, జూనియర్ కాలేజీల్లో సెప్టెంబర్ 1 నుంచే క్రీడలకు సన్నద్ధం కావాలి. మండల, నియోజకవర్గ స్థాయి, అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో అండర్–14, అండర్–17 బాలబాలికల క్రీడా పోటీలు నిర్వహించాల్సి ఉంది. ఈ పోటీలపై విస్తృత ప్రచారం చేసి.. అందరినీ ఇందులో భాగస్వాములను చేయాలి. కానీ ఉన్నతస్థాయిలో దీనిపై పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లాలో వార్షిక క్యాలెండర్ సక్రమంగా అమలు కావడం లేదు. ఫలితంగా వ్యాయామ విద్య సవ్యంగా సాగడం లేదు.

స్కూల్ గేమ్స్‌కు క్రేజ్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు మెండుగా ఉంటాయి. అందుకనే వీటిలో పాల్గొనేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబరుస్తారు. పాఠశాల స్థాయిలో క్రీడాకారుల ప్రతిభ వెలికి తీసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పోటీల నిర్వహణకు తగిన నిధులు కేటాయింపులు ఉండేవి. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో జిల్లాలో క్రీడా పోటీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని వ్యాయామ ఉపాధ్యాయులు సైతం అంటున్నారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో క్రీడలకు ఆదరణ కరువవుతోంది.

క్రీడాకారుల ఆకలి కేకలు

మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో.. పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. పోటీల వేదిక సమీపంలోని పాఠశాలలో క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం అందించాలి. కానీ దీనిపై ముందస్తు సమాచారం లేకపోవడం, పాఠశాలలో ఉన్న విద్యార్థులకు తోడు, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరికీ వంట చేయలేని పరిస్థితులు ఉన్నాయి. దీంతో క్రీడాకారులకు భోజనం అందడం లేదని తెలుస్తోంది. దీంతో కొంత మంది ఫిజికల్ డైరెక్టర్లు తమ సొంత డబ్బులు వెచ్చించి విద్యార్థులకు భోజనాలు సమకూర్చాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

క్రీడాకారుల ఎంపిక ఇలాగేనా.?

రాష్ట్రస్థాయి పోటీల షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించడంతో జిల్లా జట్ల ఎంపికలో హడావిడి తప్పడం లేదు. భీమిలి నియోజకవర్గ పరిధి అండర్–17 బాల, బాలికల వాలీబాల్ పోటీలు నిర్వహించకుండానే.. అనకాపల్లి జిల్లా నక్కపల్లి(పెద్దగుమ్ములూరు)లో ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆడించేశారు. ఆనందపురం, భీమిలి, చినగదిలి, పద్మనాభం మండలాల పరిధిలో ఆయా స్కూళ్ల ఫిజికల్ డైరెక్టర్ల ఇష్టం మేరకు జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక జరిగిపోయింది. పోటీలంటూ జరిగితేనే కదా ఎవరికి సత్తా ఉందనేది తెలుస్తుంది. కానీ అసలు పోటీలే నిర్వహించకుండా.. జిల్లా స్థాయి ఎంపికలు ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అపుస్మా అధ్యక్షుడిగా ఎంవీవీ

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) విశాఖ జిల్లా అధ్యక్షుడిగా వాగ్దేవి పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వి.వి.సత్యనారాయణ, కార్యదర్శిగా యు.సురేష్‌కుమార్, కోశాధికారిగా ఎన్.శేషారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా అపుస్మా మెంటర్ ఎ.కృష్ణారెడ్డి వ్యవహరించారు. కొత్తగా ఎన్నికైన వారు 2024 నుంచి 2026 వరకు పదవుల్లో కొనసాగుతారు. వీరిని డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఎం.వి.రావు, మళ్ల రామునాయుడు బలపరిచారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎం.వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల అభివృద్ధికి , సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఉత్సాహంగా వృద్ధుల వాక్‌థాన్

బీచ్‌రోడ్డు: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ ఉత్సాహంగా జరిగింది. హెల్ప్ ఏజ్ ఇండియా, వయో వృద్ధుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. 'సమాజం అందరి కోసం' థీమ్‌తో వృద్ధులు, పెద్దలను గౌరవించండి.. ఇది మన సంప్రదాయం.. తల్లిదండ్రుల సంరక్షణ మరువకండి.. వంటి నినాదాలతో సందర్శకులు, వాకర్స్ క్లబ్ సభ్యులు, వృద్ధులు బీచ్‌రోడ్డులో నడక సాగించారు. హెల్ప్ ఏజ్ ఇండియా ప్రతినిధి, స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ మణాల్ లంకపల్లి మాట్లాడుతూ వృద్ధులకు పటిష్టమైన, సామాజిక భద్రత అవసరమన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలయ్యేలా కృషి చేయాలని కోరారు. స్నేహ సంధ్య సంఘం ప్రతినిధి జగదీష్, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘ నాయకుడు కొత్తూరి మంగపతి రావు తదితరులు పాల్గొన్నారు.

లీజులు చెల్లించని షాపులకు తాళాలు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ వాణిజ్య సముదాయాలలో లీజులకు తీసుకున్న షాపులకు అద్దెలు చెల్లించకపోవడంతో వాటికి అధికారులు తాళాలు వేశారు. మంగళవారం లీజులు చెల్లించని షాపులపై చర్యలు తీసుకునేందుకు వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో లీజులు చెల్లించని 75 షాపులకు తాళాలు వేయగా.. సాయంత్రానికి రూ.73 లక్షల అద్దెల రూపంలో వసూలయ్యాయి. లీజుదారులు సకాలంలో అద్దెలు చెల్లించి వీఎంఆర్‌డీఏ చేపడుతున్న అభివృద్ధి పనులకు తోడ్పాటు అందించాలని కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో మాస్టర్

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ములపర్తి ప్రకాశరావు



విమానాశ్రయంలో ప్రకాష్ అభినందిస్తున్న ప్రముఖులు

సీతమ్మధార: తైక్వాండోలో అతను మాస్టర్.. పంచ్ విసిరితే పతకం రావాల్సిందే.. వేదిక ఏదైనా సరే విజేతగా నిలవడమే ఆయనకు తెలుసు. ఓ వైపు క్రీడాకారుడిగా.. మరోవైపు కోచ్‌గా అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ములపర్తి ప్రకాశరావు ప్రతిభ ఎనలేనిది. కంచరపాలెంలో నివాసముంటున్న ప్రకాశరావుది విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి. విశాఖలో స్థిరపడ్డారు. మార్షల్ ఆర్ట్స్‌లో ఆసక్తితో గురువు పాండ్రంగి రుక్మాకరరావు వద్ద చిన్నప్పటి నుంచి శిక్షణ పొందాడు. అంచెలంచెలుగా అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే స్థాయికి ఎదిగాడు. అనంతరం కోచ్‌గా మారి ఇప్పటి వరకు సుమారు 16 వేల మంది విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చారు. గత నెల 27, 28, 29 తేదీల్లో మలేషియా ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని సీనియర్ వెయిట్ కేటగిరీ 80 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి సత్తా చాటాడు. మంగళవారం నగరానికి చేరుకున్న ఆయనకు తన గురువు డాక్టర్ పాండ్రంగి రుక్మాకరరావు, స్పాన్సర్ చేసిన విశాఖపట్నం 105 అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ దండెం పోలారావు, తిరుపతిరాజు, ఉషారాణి, విశ్వేశ్వరరావు, డి.ఎల్.కె.రావు, క్లబ్ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

పోలీసులపై దాడి కేసులో నలుగురి అరెస్ట్

బీచ్‌రోడ్డు: పోలీసులపై దాడి చేసి ఘటనలో నలుగురు బీచ్ వ్యాపారులు అరెస్ట్ అయ్యారు. అల్లూరి జిల్లాకు చెందిన కానిస్టేబుల్, నగరానికి చెందిన ఇద్దరు హోంగార్డ్‌లపై ఆదివారం అర్ధరాత్రి బీచ్ వ్యాపారాలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై గాయపడిన పోలీసులిచ్చిన ఫిర్యాదుతో మూడో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నలుగురు వ్యాపారులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు కచ్చితంగా దసరా సెలవులను పాటించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు తగిన సూచనలతో కూడిన సర్క్యులర్‌ను మంగళవారం జారీ చేశారు. దసరా సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు తల్లిదండ్రులకు సమాచారం ఇస్తున్నాయని.. దీనిపై తమకు ఫిర్యాదులు అందాయన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.76,910
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.70,500
వెండి(కిలో):	రూ.1,01,000

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.118
స్కిన్	: రూ.206
స్కిన్‌లెస్	: రూ.216

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	535.00
విజయనగరం	539.00
శ్రీకాకుళం	539.00

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

జేఏసీ దీక్షలో వక్తల డిమాండ్



జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిరాహార దీక్షలో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిరాహార దీక్షల నిర్వహణకు రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు జీవీఎంసీ గాంధీ పార్కులో మంగళవారం నిర్వహించిన దీక్షలో విద్యార్థి, యువజన, ఇతర సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై ఆధారపడి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు చెప్పిన మాటలు విస్మరించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి తాకట్టు పెట్టి, మోదీ ప్రభుత్వ వారసుడిగా అవతారం ఎత్తారని ఎద్దేవా చేశారు. అన్ని విధాలుగా వీరు విఫలమవడంతోనే ప్రజలను పక్కదారి పట్టించేందుకు తిరుమలలో ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందనే ప్రచారం మొదలుపెట్టారన్నారు. ప్రజలను రెచ్చగొట్టే ఆలోచనలు పక్కన పెట్టి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. జె.ప్రభాకర్, ఎం.సుబ్బన్న, యు.ఎస్.ఎన్.రాజు, కె.సంతోష్‌కుమార్, ఎన్.శ్రీను, విశ్వనాథం, లక్ష్మి, రాంబాబు, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, ఈశ్వరరావు, రాము, సాయి, శ్రావణ్, భాను పాల్గొన్నారు.

'అమ్మేటందుకు వాడెవడు.. కొనేటందుకు వీడెవడు'

ప్రజా గాయకుడు దేవిశ్రీ ఆటపాట



జీవీఎంసీ గాంధీ పార్కులో ప్రజా గాయకుడు దేవిశ్రీ ఆటపాట

సీతమ్మధార: 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కుని నినదించిన వారెందరో.. పోరుదారిలో అశువులు బాసిన అమరవీరులు ఎందరో.. వారి త్యాగము ఏమాయెనో పాలకులారా.. ఆ త్యాగాలను తుంగలోకి తొక్కింది మీరా? అచ్చేదిన్ అంటే మేము సంబరపడ్డాం.. సచ్చే దిన్ వచ్చిందని తెలుసుకోలేకున్నాం.! మోదీ పాలనలో కేడీల రాజ్యమా.. అడిగేవాడికి బేడీలా.. ఇదే మన స్వరాజ్యమా.. తెన్నేటి విశ్వనాథం, అమృతరావు పోరాటం గుర్తుకు రాలేదా ఈ పాలకులకు ఒకసారైనా.. ఈనాడు మోదీ అమ్మేస్తే ఊరుకుంటామా.. కలబడి నిలబడి మనమంతా పోరు జెండానే ఎత్తుదమ.. అమ్మేటందుకు వాడెవడు.. కొనేటందుకు వీడెవడు.. ఎవడబ్బ సొమ్మని వాడు విర్రవీగుతుండు.. స్టీల్‌ప్లాంట్‌కి గనులిచ్చి విశాఖ ఉక్కును కాపాడాలి.. అందుకనే మనమంతా చేయి చేయి కలిపి నడవాలి' అంటూ ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తనదైన శైలిలో ఆటపాట ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. జీవీఎంసీ గాంధీ పార్కులో జరుగుతున్న ఉక్కు పరిరక్షణ దీక్షల్లో మంగళవారం పాల్గొని.. తన నిరసన తెలిపారు.

మహిళా సంఘాలపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన కేసు కొట్టివేత



కేసును వాదించిన న్యాయవాదులతో మహిళా సంఘాల ప్రతినిధులు

అల్లిపురం: మహిళలను అసభ్యకరంగా చూపిస్తూ 2017లో నగరంలో ఓ హోటల్‌లో నిర్వహించిన అందాల పోటీలను ఏపీ మహిళా సమాఖ్య, ఐద్వా, పీవోడబ్ల్యూ, సీఎంఎస్ సంఘాలు వ్యతిరేకించాయి. నిరసన తెలిపిన 27 మంది మహిళలపై అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పోలీసులు అక్రమంగా కేసు పెట్టారు. ఈ కేసును కొట్టివేస్తూ నగరంలో 3వ అదనపు సివిల్ జడ్జి కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. ఈ మేరకు మహిళా, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, ఎండీ బేగం, బి.పరమేశ్వరి, సీహెచ్ నూకాలమ్మ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, ప్రగతి శీల మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, సీఎంఎస్ డి.లలిత తదితరులు మాట్లాడారు. మహిళలను అసభ్యకరంగా చూపించడాన్ని ఖండించినందుకు ప్రభుత్వం తమపై కేసు పెట్టింది గానీ.. అందాల పోటీలను మాత్రం ఆపలేకపోయిందన్నారు. ఇది మహిళాలోకాన్ని అవమాన పరచడమేనన్నారు. ప్రభుత్వాలు మహిళల అభ్యుదయానికి పాటుపడాలన్నారు. న్యాయం కోసం పోరాడిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి పనులు

జీవీఎంసీ ప్రాజెక్ట్స్, అభివృద్ధి పనులపై ఎంపీ సమీక్ష



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎంపీ భరత్

డాబాగార్డెన్స్: భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. జీవీఎంసీ చేపడుతున్న ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై ప్రభుత్వ అతిథి గృహంలో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలో తాగునీరు, వీధి దీపాలు, కొండవాలు ప్రాంతాలు, రోడ్లు, కాలువలు, పార్కుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నగరమంతా 24 గంటలూ తాగునీరు సరఫరా చేయాలని, అందుకు కావాల్సిన వనరులను సమీకరించుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. గెడ్డల ఆక్రమణను నిరోధించేందుకు పట్టణ ప్రణాళికా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమైన, అత్యవసరమైన ప్రాజెక్టు పనులపై నివేదిక సిద్ధం చేసినట్టయితే సీఎస్ఆర్ నిధులు సమకూరుస్తామని ఎంపీ తెలిపారు. ముందుగా జీవీఎంసీ కమిషనర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మెల్సీలు రామారావు, వేపాడ చిరంజీవి రావు, ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, పీలా శ్రీనివాసరావు, గండిబాబ్జీ, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఏయూలో డీన్ల నియామకం

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీలో పలువురిని డీన్లుగా నియమిస్తూ వీసీ ఆచార్య శశిభూషణరావు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం డీన్‌గా సీహెచ్ శ్రీనివాసరావు, గెస్ట్ హౌస్‌లకు ఇన్‌చార్జి డీన్‌గా లైబ్రరీ సైన్స్ ఆచార్యుడు డాక్టర్ వి.ధనరాజ్, సీడీసీ అసోసియేట్ డీన్‌గా ఆచార్య ఎ.రామనాగ హనుమాన్, నార్త్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా డాక్టర్ చల్ల నరసింహం, కాన్ఫిడెన్షియల్ విభాగం అసోసియేట్ డీన్‌గా ఆచార్య పి.వెంకటేశ్వరరావు, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీవోఈ) అసోసియేట్ డైరెక్టర్లుగా డాక్టర్ వి.సిద్ధయ్య, సి.హెచ్.శ్రీనివాసరావులను నియమించారు. వీరికి రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ నియామక ఉత్తర్వులు అందించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి పురందేశ్వరిని తొలగించాలి

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించే హక్కు సుప్రీంకోర్టుకు లేదని పురందేశ్వరి వ్యాఖ్యానించడం రాజ్యాంగ విరుద్ధమని జనజాగరణ సమితి తెలిపింది. హిందువుల మనోభావాలను మరిది చంద్రబాబు కాళ్ల దగ్గర పురందేశ్వరి తాకట్టు పెట్టారని ఓ ప్రకటనలో సమితి రాష్ట్ర కన్వీనర్ ఆరోపించారు. సరైన ఆధారం లేకుండా తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా ప్రకటన చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో చంద్రబాబును సుప్రీంకోర్టు ప్రశ్నించడాన్ని హిందూ సమాజం స్వాగతించిందన్నారు. అయితే సుప్రీంకోర్టును తప్పుపడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వ్యాఖ్యానించడంపై ఆ పార్టీ జాతీయ నాయకత్వం తక్షణమే స్పందించి.. ఆ పదవి నుంచి ఆమెను తొలగించాలని వాసు డిమాండ్ చేశారు.

అపురూపంగా అమ్మ విగ్రహాలు





డాబాగార్డెన్స్ : దేవీ నవరాత్రుల ఉత్సవాలు ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పలు దేవాలయాల్లో దేవీ నవరాత్రులు నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. విజయదశమి తొమ్మిది రోజులు పూజలు ప్రారంభించిన వారు కొందరైతే.. విజయదశమి రోజున నిలిపి నవరాత్రులు జరిపే వారు మరికొందరు. నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని నగరంలో ఇప్పటి నుంచే సందడి నెలకొంది. కళాకారులు వివిధ కళాకృతుల్లో దుర్గమ్మ ప్రతిరూపాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఉత్సవాల నిర్వాహకులు వారికి కావల్సిన ఆకృతుల్లో ముందుగానే ఆర్డర్లు ఇచ్చి మరీ తయారు చేయించుకుంటున్నారు. అమ్మ రూపం ప్రతి మదిలో కొలువుండేలా విగ్రహాలను రూపొందిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మేము సైతం

వాతావరణం కలుషితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అంటున్నారు విగ్రహ తయారీదారులు. కోల్‌కతా, ఒడిశా, భద్రకు నుంచి వలస వచ్చిన కొంత మంది కళాకారులు మధురవాడ (ఎస్‌బీఐ బ్యాంక్ పక్కన), పాతనగరం, కంచరపాలెం, ధర్మానగర్, రామ్మూర్తిపంతులపేట, పాతపోస్టాఫీస్ తదితర ప్రాంతాల్లో మట్టితో మాత్రమే అమ్మవారి విగ్రహాలు తయారు చేస్తున్నారు. రసాయనాలు లేని సహజ రంగులను ఉపయోగిస్తూ, భక్తులను ఆకర్షించేలా విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు.



విగ్రహాన్ని మండపానికి తరలిస్తున్న యువకులు



అమ్మవారిని అలంకరిస్తున్న కళాకారుడు